ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను అధిగమించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ప్రతికూల వాతావరణంలోనూ రైతులను ఆదుకునే పంట ఆయిల్‌పామ్ అని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరంలో జిల్లాలో 550 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగును లక్ష్యంగా నిర్దేశించారని, అందుకు సంబంధించి లక్ష్యాల సాధన కోసం అన్నదాతలకు అవగాహన కల్పించాలన్నారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ కింద జిల్లాలో కర్నూలు, కృష్ణగిరి, సీ.బెళగల్, కౌతాళం, ఆదోని, హోళగుంద, మంత్రాలయం, పెద్దకడబూరు, కోసిగి, నందవరం, ఎమ్మిగనూరు, హాలహర్వి, గోనెగొండ్ల మండలాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. నీటి వసతి ఉన్న మండలాల రైతులు అర్హులని, వారితో ఆయిల్‌పామ్ సాగు చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు వంద శాతం రాయితీతో మొక్కలను అందిస్తారని, నాలుగు సంవత్సరాల పాటు నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం రూ.5250, అంతర పంటల ప్రోత్సాహానికి రూ.5250 అందిస్తున్నట్లు చెప్పారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, అధికారులు

కలెక్టర్ చొరవతో భూసమస్య పరిష్కారం

కర్నూలు(సెంట్రల్): దశాబ్ద కాలం నుంచి పరిష్కారం కాని భూ సమస్యకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా చొరవతో పరిష్కారం లభించింది. ఆదోని మండలం చిన్నగోనేహాల్‌కు చెందిన ఎల్.విశ్వనాథరెడ్డికి సంతకోడ్లూరు గ్రామ పరిధిలోని 435–ఏ సర్వే నంబర్‌లో 1.66 ఎకరాల భూమి ఉంది అతడు 2015లో భూమిని అమ్ముకోవడంతో కొన్నవారు 2018లో లోన్ కోసం వెళ్లగా నిషేధిత జాబితాలో ఉందని చెప్పడంతో విశ్వనాథరెడ్డితో గొడవ పడ్డారు. ఈ క్రమంలో భూమిని వెనక్కి తీసుకొని డబ్బును తిరిగి చెల్లించిన విశ్వనాథరెడ్డి అప్పటి నుంచి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చివరకు పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యను కలెక్టర్ ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కారానికి పూనుకున్నారు. ఆయన పొలం పక్కనే వంకపోరంబోకు 0.81 ఎకరాలు ఉండడంతో రెండు కలిపి మొత్తం 2.47 ఎకరాలను 2016లో అధికారులు నిషేధిత జాబితాలో ఉంచారు. కలెక్టర్ దానిని తొలగించి విశ్వనాథరెడ్డి భూమిని మళ్లీ డినోటిఫై చేయడంతో సమస్యకు పరిష్కారం లభించింది. దీంతో బాధితుడు సోమ వారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎవరి పక్కన చెత్త ఉంటే వారికి జరిమానా

కలెక్టరేట్ పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని పలుమార్లు చెప్పినా అధికారులు మారడం లేదని, ఇప్పటికీ తాగిన టీ గ్లాసులు, తిన్న ప్లేట్లను పడేస్తున్నారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎవరి పక్కన చెత్త ఉంటే వారిపై క్రమశిక్షణ చర్యలతోపాటు జరిమానా విధించేందుకు అవకాశాలను పరిశీలించాలని డీఆర్వో సి.వెంకట నారాయణమ్మను ఆదేశించారు. ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు వారి కార్యాలయాలే శుభ్రంగా లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లోని అన్ని శాఖల హెచ్ఓడీలతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, చెత్త లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 2 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను కార్యాలయాల్లో నిషేధిస్తున్నారని, ఇందుకోసం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీటి ట్యాంకుల క్లీనింగ్‌కు స్పెషల్ డ్రైవ్

కర్నూలు (అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం మాట్లాడుతూ.. ఈ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అన్ని ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఆయా ట్యాంకుల్లో క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయిస్తున్నామని చెప్పారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలోని అధికారులు, సిబ్బంది స్పందించాలన్నారు. ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని పలు హోటళ్లలో సోమవారం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ తనిఖీలు నిర్వహించారు. వినియోగదారుల ఫిర్యాదుల మేరకు వెంకటరమణ కాలనీలోని అజ్వా రెస్టారెంట్, నంద్యాల రోడ్డులోని నైస్టీస్ కర్రీస్ పాయింట్‌లో తనిఖీలు నిర్వహించి ఆహారం, తయారీకి వాడే పదార్థాలను పరిశీలించారు. పలు శాంపిల్స్ తీసి ల్యాబోరేటరీకి పంపించారు.

క్లుప్తంగా

పెద్దాసుపత్రికి వీల్‌చైర్ల విరాళం


వీల్ చైర్లు అందజేసిన ఏఆర్ కానిస్టేబుల్ సుంకన్న దంపతులు

కర్నూలు (హాస్పిటల్): తనకు ఆపరేషన్ చేసి ప్రాణదానం చేసిన పెద్దాసుపత్రికి ఓ మహిళ రెండు వీల్ చైర్లను విరాళంగా అందజేశారు. కర్నూలు నగరంలోని కొత్తపేటకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఎస్.సుంకన్న భార్య ఎస్.వెంకమ్మకు 2022 మార్చిలో వెన్నెముక వద్ద కణతి ఉండటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని న్యూరో సర్జరీ విభాగంలో చేరింది. ఆమెను పరీక్షించిన వైద్యులు వెన్నెముక వద్ద కణతి ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేసి తొలగించారు. దీనికి కృతజ్ఞతగా ఆమె భర్త సుంకన్నతో కలిసి సోమవారం న్యూరో సర్జరీ విభాగానికి రెండు వీల్‌చైర్లను విరాళంగా అందజేశారు.

నేడు విద్యుత్ కార్యాలయాల ముట్టడి


సంతకాల సేకరణ చేపట్టిన సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టే విద్యుత్ కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు టి.రాముడు పిలుపునిచ్చారు. సోమవారం శ్రీరామనగర్‌లో సీపీఎం నాయకులు అజ్మత్ అధ్యక్షతన స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదానీ స్మార్ట్ మీటర్లు తమకొద్దని ప్రజలు అంటున్నా బలవంతంగా అమర్చడం ప్రభుత్వానికి తగదన్నారు. అధికారంలో లేని సమయంలో చంద్రబాబు, లోకేష్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడారని, ఇప్పుడు మాత్రం నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి ప్రజలపై భారం వేయడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో పి.నాగరాజు, శేషం, రాజు, ఆర్.రవికిషోర్, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టి.షడ్రక్‌కు సీపీఎం నివాళి


టి.షడ్రక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి టి.షడ్రక్‌కు ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ నివాళులర్పించారు. సోమవార కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టి.షడ్రక్ ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కష్టజీవుల రాజ్య స్థాపన కోసం కృషి చేయడమే షడ్రక్‌కు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని ఈ సందర్భంగా ఎంఏ గఫూర్ అన్నారు. పాతబస్టాండ్‌లోని సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ షడ్రక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.రాముడు, పీఎస్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ కర్నూలు


హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ సాధించిన కర్నూలు జట్టు

కర్నూలు (టౌన్): హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈనెల 2, 3 తేదీల్లో నిర్వహించిన ఇన్విటేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నమెంటులో కర్నూలు జట్టు చాంపియన్‌షిప్ సాధించింది. ఆంధ్ర, తెలంగాణ నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్ కర్నూలు జట్టు, ఎల్బీ స్టేడియంకు చెందిన జట్టుతో జరిగిన పోరులో 29 – 28 గోల్స్‌తో జిల్లా జట్టు చాంపియన్‌షిప్ సాధించిందని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రుద్రా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి ఇస్కాన్‌లో జులన్ యాత్ర

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శ్రీ రాధామాధవుల జులన్ యాత్ర, సంకీర్తన ఉత్సవాలను మంగళవారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కర్నూలు, బాధ్యులు రఘునందన సేవక ప్రభు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని హైదర్‌ఖాన్, జొహరాపురం, బుధవారపేట ప్రాంతాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.నిర్మల, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వ ర్యంలో కలెక్టరేట్ ఎదుట ఇళ్ల పట్టాల కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయా కాలనీల్లో దాదాపు 20 ఏళ్ల నుంచి పేదలు నివాసం ఉంటున్నా పట్టాలు ఇవ్వడం లేదన్నారు. జొహరాపురంలో బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా వాటికి సంబంధించిన పట్టాలను హౌసింగ్ కార్యాలయాల్లోనే ఉంచుకున్నారన్నారు. ఇప్పటివరకు ఒక్కరికీ కూడా ఇళ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం జీఓ నంబర్ 30ని విడుదల చేసిందని, ఈ జీఓ ప్రకారం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వొచ్చని, అయితే కేవలం పెద్దలకు మాత్రమే ఆ జీఓను వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నాయకులు విజయ్, షరీఫ్, అబ్దుల్ దేశాయ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.మద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరంట్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల డిమాండ్స్ డే పాటించారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులకు వెంటనే కొత్త అక్రిడేషన్లను మంజూరు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ హెల్త్‌కార్డులు మంజూరు చేసి ఉచితంగా వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సొంతిల్లు లేని జర్నలిస్టులకు 5 సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టి ఇవ్వాలన్నారు. 60 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని, జర్నలిస్టులపై దాడులను అరికట్టి రక్షణగా నిలిచేందుకు జర్నలిస్టు రక్షణ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు అక్రమార్కుల నుంచి రక్షణ కల్పించాలని, వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. నగర కమిటీ గౌరవాధ్యక్షుడు శివకుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శివశంకర్, ఎర్రమల, నాయకులు రఫీ, బీముడు, శీను, రమేష్, మణిబాబు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

రహదారులు, డ్రైనేజీలు నిర్మించండి


అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణకు వినతిపత్రాలు ఇస్తున్న నగర వాసులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 20వ వార్డు వాసవీ నగర్, సనత్ నగర్ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానికులు మహేశ్వరయ్య, సురేష్ చౌదరి విన్నవించారు. సోమవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో అలసత్వం లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఆర్ఓ జునీద్, పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- మద్దూరు నగర్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని స్థానిక కార్పొరేటర్ జె.రమణమ్మ విన్నవించారు.
- కల్లూరు శివప్ప నగర్, నాగిరెడ్డి నగర్ ప్రాంతాల్లో నాలుగు నెలలుగా తాగునీటి సమస్య ఉందని, స్థానికులు దౌలత్ బాషా, శివరాములు, హుస్సేన్ బాషా అభ్యర్థించారు.
- బెంగుళూరు వాసి శ్రీస్వామి అనే వ్యక్తి వెంకటరమణ కాలనీ రోడ్ నంబర్–2లో సీసీ డ్రైనేజీ కాల్వపై మరుగుదొడ్డి బెడ్ నిర్మిస్తున్నాడని, వాటి కింద తమ పైపులైన్లు ఉన్నాయని స్థానికులు వెంకటేష్, గోపాల్ రెడ్డి, రమేష్ ఫిర్యాదు చేశారు.

నిషేధిత ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పాఠశాలల్లోకి విద్యా కమిటీ సభ్యులు తప్ప ఇతరులెవరూ వెళ్లడానికి వీల్లేదంటూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సాయిఉదయ్, రంగప్ప మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తున్నామని, తక్షణమే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి, రాజకీయ పార్టీల నాయకులు పాఠశాలల్లో సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి నివేదించడం కోసం, విద్యార్థుల హక్కులకు భంగం కలిగిన సమయాల్లో న్యాయం కోసం పోరాటం చేసేందుకు వెళ్తుంటారని, అలా వెళ్లకూడదని చెప్పడానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయమన్నారు. చైతన్య, నారాయణ, భాష్యం విద్యాసంస్థలు కూటమి నేతలకు చెందినవి కావడంతో ఆయా పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తున్నారని, వారిని ప్రశ్నించేందుకు ఎవరూ వెళ్లకూడదన్న నిర్ణయంతో ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోందన్నారు. నాయకులు అబుబకర్, అమర్, అంజి, పృథ్వి, యోగి, దీక్షిత్, మురళీ, హరి పాల్గొన్నారు.

కుమారుడు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు


అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరాకు సమస్య చెప్పుకుంటున్న వృద్ధురాలు

కర్నూలు: కుమారుడు వెంకటేశ్వరాచారి తన బాగోగులు పట్టించుకోకుండా కర్నూలు ప్రభుత్వాసుపత్రి వద్ద రోడ్డుపై వదిలేసి వెళ్లాడని కర్నూలు ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన మునెమ్మ ఫిర్యాదు చేసింది. వృద్ధురాలు అనే కనికరం కూడా లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరాకు చెప్పుకుని కన్నీటి పర్యంతమైంది. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 104 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కుమారుడు హరికృష్ణ మద్యం తాగి అర్ధరాత్రి వచ్చి డబ్బులు ఇవ్వాలంటూ గొడవ పెట్టుకుని ఇంట్లోని వస్తువులన్నీ పగులగొడుతున్నాడని కర్నూలు జనార్దన్ నగర్‌కు చెందిన నాగమణి ఫిర్యాదు చేశారు.
- బంధువులు తన పొలం ఆక్రమించుకుని దాడి చేసి చంపడానికి ప్రయత్నిస్తున్నారని సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి గ్రామానికి చెందిన ఫక్కీరప్ప ఫిర్యాదు చేశారు.
- జిల్లా కోర్టులో తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలుకు చెందిన హరిప్రసాద్, మురళీధర్ రెడ్డి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశారని సత్యసాయి జిల్లా నంబూల పూలకుంట గ్రామానికి చెందిన ఎస్.అమీర్ బాషా ఫిర్యాదు చేశారు.

రెండ్రోజులు నీటి సరఫరా నిలిపివేత

కర్నూలు (టౌన్): నగరంలోని దేవనగర్, కేసీ కెనాల్, రైల్వే ట్రాక్ మధ్యలో మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 400 ఎంఎం పైప్‌లైన్ ధ్వంసమైందని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. రెండో రైల్వే లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నందున ఈ పైప్‌లైన్ దెబ్బతిందని ఆయన తెలిపారు. ఈ కారణంగా 21వ వార్డు పరిధిలోని కమలానగర్, మహాలక్ష్మి నగర్, డాక్టర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, పార్థసారధి నగర్, లేపాక్షి నగర్, 25వ వార్డు పరిధిలోని ఓల్డ్ హౌసింగ్ కాలనీ, న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎండోమెంట్ కాలనీ, బిర్లా కాంపౌండ్, అరోరా నగర్ ప్రాంతాల్లో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు. బుధవారం నుంచి తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని కమిషనర్ వెల్లడించారు.


పైప్‌లైన్ మరమ్మతు పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

6న జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 6వ తేదీన జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బీ.భూపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 4400 మీటర్ల పరుగుపందెం, షాట్ పుట్, లాంగ్ జంప్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో ఈ పోటీలు ఉంటాయని, 22 సంవత్సరాల వయస్సు కలిగిన స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఆధార్‌కార్డు, ఐడీ కార్డు రుజువుతో హాజరు కావాలని, వివరాలకు 90004 93408 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ధూమపానంతో క్షయ ముప్పు

కర్నూలు(రూరల్): పొగ తాగే అలవాటు ఉన్న వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు అబ్దుల్ అనిద్ చెప్పారు. ఆయన సోమవారం కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో టీబీ ముక్త అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సోమేశ్వరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాట్లాడుతూ.. రెండు వారాలకు మంచి దగ్గు, రాత్రిపూట చెమటలు పట్టడం, 60 ఎళ్లు పైబడిన వారు, పొగ తాగేవారు, మద్యం సేవించేవారు, పౌష్టికాహార లోపం ఉన్న వారికి టీబీ గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. ఇందులో భాగంగా నిక్షయ్ వాహన్, నిక్షయ్ శిబిరాలు ఎర్పాటు చేసి జన భగీదారిలో భాగంగా గ్రామంలో ప్రజలకు టీబీ గురించి తెలపాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి రమణ, టీబీ సూపర్ వైజర్ నిషిత్, హెల్త్ సూపర్ వైజర్ నాగమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కర్నూలు (న్యూటౌన్): అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పని చేయని సర్వర్లతో టీచర్లకు భారంగా మారిన యాప్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి బాలదుర్గమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చౌడేశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఓటీపీ ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని నిబంధనలు పెట్టడంతో అంగన్‌వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరుకులు అన్నీ ఒకేసారి రావడం లేదని, సిగ్నల్ సమస్యతో సరుకులు చేర్చలేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ ఇన్ అవుట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్వర్లు పని చేయడం లేదని, అన్ని యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్‌ను అమలు చేయాలని కర్నూలు సీడీపీఓ అనురాధకు సెల్‌ఫోన్‌లను, సిమ్‌కార్డులను వెనక్కి ఇచ్చేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.